నవంబర్ - డిసెంబర్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవుని నామములో స్పర్శ పాఠకులకు నా వందనములు. దేవుడు గడిచిన కాలమంతా మనలను కాచి కాపాడినందుకు ఎంత స్తుతించిననూ ఋణస్తులమే. ఈ సంవత్సరం చివరి రెండు నెలలు మనలను ఆయన కృపలో భద్రపరచాలని ప్రార్థన చేద్దాము. సంవత్సరాంతములో కృతజ్ఞతా హృదయముతో ఉందాము.

భక్తుడైన హబక్కూకు (హబక్కూకు 3:2) ఇలా అంటున్నాడు. "సంవత్సరములు జరుగుచుండగా నీ కార్యములు నూతనపరచుము" ఇది ఎంతో అవసరమైన విషయం. ఆయన కార్యములు మన జీవితంలో నూతనపరచడం లేకపోతే దేవునిలో జీవిస్తున్నాము అనే దానికి అర్థమే లేదు. కనుక కృప, పవిత్రత, దాతృత్వము, క్షమించుటలలో ఎదుగునట్లు మనలను నూతనపరచమని దేవునిని అడుగుదాము. మన జీవితములలో ఎల్లప్పుడూ నూతనపరచబడాలనేది దేవుని ఉద్దేశ్యము. ప్రతి సంవత్సరము మనము, మన ఇంటి వారందరూ నూతనపరచబడాలనే ఆశ కలిగి ఉందాం.

సంవత్సరము ముగించబడి నూతన సంవత్సరములోకి ప్రవేశిస్తు న్నామంటే ప్రభువు రాకడకు దగ్గరవుతున్నామనేది వాస్తవం. ఆయనతో కూడా యుగయుగములు జీవించే సమయం సమీపిస్తున్నది. ఇది ఎంతో సంతోషం కలిగించే విషయం. నిజక్రైస్తవుడు దీనికొరకే ఈ లోకంలో నిరీక్షిస్తూ ఉంటాడు. మనలను దేవుడు ఏ స్థితిలో ఉంచినప్పటికీ ఆయన రాకడను గురించిన నిరీక్షణ విడిచిపెట్టకూడదు.

కనుక 2011వ సంవత్సరములో ఈ చివరి రెండు నెలలు కృతజ్ఞతా హృదయముతో నూతనపరచబడాలనే ఆకాంక్షతో జీవిద్దాము.

ప్రభువు వలన అట్టి ధన్యత మనకు కలుగును గాక !

మీ సహోదరుడు.....



నవంబర్ - డిసెంబర్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

ఈ సంచికలో...


- Good Bye 2011 .......... 2
- క్రిస్మస్ కానుక .......... 5
- తార (స్త్రీల ప్రత్యేకం) .......... 6
- మూర్ఖు(రా)లు .......... 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 19వ భాగము .......... 11
- శ్రద్ధ (బాలల శీర్షిక) .......... 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) .......... 15
- ఇది సమయమా? .......... 17
- రూపాయి, యూరో, డాలర్ .......... 19
- నదులు .......... 20
- ప్రార్థన ఊపిరి పీల్చుట వంటిదే .......... 21
- బైబిల్ క్విజ్-19 .......... 22
- జన్మదిన శుభాకాంక్షలు .......... 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 9666666249, 040-24202227




- బ్రదర్. ఎపఫ్రా

ఈ సంవత్సరం ముగింపులోనికి వచ్చాము. పాత సంవత్సరమునకు వీడ్కోలు చెప్పి, నూతన సంవత్సరములోనికి ప్రవేశించడానికి అనేకులు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తూ ఉంటారు. క్రొత్త సంవత్సరం అనగానే ప్రపంచమంతా క్రొత్త క్యాలండర్స్ డిజైన్ చేయడం, క్రొత్త డైరీలు ప్రింట్ చేయించుకొని వాటిని ఒకరికి ఒకరు బహుమానములుగా ఇచ్చుకుంటారు. మన ఇంట్లో క్యాలెండర్స్, చేతిలో డైరీలు మారిపోతాయి. ఈ సంగతులన్నీ సంతోషమును కలిగించే విషయములు అయితే సగటు క్రైస్తవుడి జీవితములో క్రొత్త సంవత్సరం రాబోతుంది, అనగానే ఎలాంటి ఆలోచనలతో ముందుకి వెళ్ళాలి అనే సంగతులను ధ్యానిద్దాము.

**1. కార్యములు నూతన పరచబడుట :**

**యెహోవా, సంవత్సరములు జరుగుచుండగా**
**నీ కార్యము నూతన పరచుము** (హబక్కూకు 3:2)

సంవత్సరములు జరుగుచూ ఉన్నాయి, నీ కార్యములను నూతన పరచుము అని భక్తుడైన హబక్కూకు దేవునికి ప్రార్థన చేయుచున్నాడు. కార్యములు నూతనపరచబడడం ఎంతో అవసరం ఎందుకనగా నూతన కార్యములు లేకుండా మనము ముందుకి వెళ్తున్నామనుటలో అర్థం లేదు అయితే దేవుడు జరిగించాలి కానీ మన జ్ఞానముతో దేవుని కార్యములు జరుగుతున్నాయని కనుపరచుకోవాలని చూస్తే ఘోరంగా దెబ్బతింటాము. "నేటి దినములలో కొందరు దేవుడు కార్యములను జరిగించాలని ఎదురుచూడకుండా వారే అనేక కార్యక్రమములను చేపట్టి దేవుని కార్యములుగా చలామణి చేయాలని చూస్తున్నారు. ప్రభువు చేసే పనులు శాశ్వతములు. మనుష్యులు చేసే పనులు అశాశ్వతమైనవి. క్రీస్తుని విశ్వసించిన ప్రతివారు స్థిరమైన, శాశ్వతమైన దేవుని కార్యముల కొరకు మాత్రమే ఎదురు చూడాలి.

ప్రభువైన యేసుక్రీస్తు మానవుని జీవితములో చేసే గొప్ప కార్యము మరియు ఆయన బోధల సారాంశము నూతన పరచబడుట మాత్రమే. లోకములో ప్రతి మనుష్యుడు

జన్మ, కర్మ పాపమును బట్టి శాంతి, సమాధానము లేక చెడిపోయిన హృదయముతో దేవుడిచ్చిన ఆధిక్యత ఏ మాత్రమూ అర్థము కాక పశుప్రాయుడిగా బ్రతుకుతూ ఉన్నాడు.

**దేవునికంటె వానిని కొంచెము తక్కువవానిగా చేసియున్నావు. మహిమా ప్రభావములతో వానికి కిరీటము ధరింపజేసియున్నావు. (కీర్తన 8:5)**

హృదయమును నూతన పరచుట ద్వారా మానవుడు పోగొట్టుకున్న మహిమను తిరిగి ఇవ్వాలని దేవుని ఉద్దేశ్యము. అపో.పౌలు ద్వారా కూడా దేవుడు అదే సంగతి వ్రాయించాడు. **కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. (రోమా 12:1)**

మనస్సుమారి నూతనపరచబడాలి తద్వారా రూపాంతరపు అనుభవములోనికి రావాలని దేవుడు కోరుకుంటున్నాడు. బైబిల్ గ్రంథములో ఉన్న భక్తులను సంవత్సరములు, సంవత్సరములు దేవుడు పరీక్షించి, పరిశోధించి ఆయన కార్యములను వారి జీవితములలో నూతనపరిచారు. మన జీవితములలో కూడా ఆయన తన కార్యములను సంవత్సరములు జరుగుచుండగా నూతనపరచాలి అని హబక్కూకు లాంటి ప్రార్థన మనం కూడా చేయవలసి ఉంది. 2011లో నుండి 2012లోకి మరికొన్ని దినములలో మనము ప్రవేశించడానికి సిద్ధమవుతూ ఉన్నాము. ఈ దినములలో ప్రభువు కార్యముల కొరకు కనిపెట్టుకొని ఉందాము.

**2. దేవుని కనుదృష్టి :**

***అది ఆకాశవర్షజలము త్రాగును. అది నీ దేవుడైన యెహోవా లక్ష్యపెట్టు దేశము. నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు దానిమీద ఉండును. (ద్వితీ 11:12)***

సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు మన మీద, మన కుటుంబముల మీద ఆయన కనుదృష్టి ఉంటుందనేది వాక్య సారాంశము. దేవుని దృష్టి ఎవని మీద నిలిచి ఉండునో వాడు ధన్యుడు. నరుడు దేవుని దృష్టికి ఏ పాటి వాడు? కానీ దేవదేవుడు మానవాళి కొరకు తన్ను తాను తగ్గించుకొని భూమి మీదికి రావడం ద్వారా మనలను ఎంత ప్రేమిస్తున్నాడో అర్థమవుతుంది. అయితే ప్రభువు సమీపంగా ఉన్నాడు ఆయన కనుదృష్టి మన మీద ఉన్నది అనే దేవుని మాటలు మనకి ఎంతో ధైర్యమును కలిగిస్తాయి. నిజముగానే ఆయన ఆత్మస్వరూపియై యుండి ప్రతిక్షణం మనలను చూస్తూనే

ఉన్నాడు. సాధారణంగా దేవుడు చల్లగా చూస్తున్నాడు అని అంటూ ఉంటారు. ఆయన మనలను ఒక్క క్షణం విడిచిపెడితే మనం ఏమీ చేయలేము. మన జీవితం ఆవిరిబుడగ వంటిది గనుక దేవుడు ఆయన దృష్టిని మన మీద, మన కుటుంబముల మీద సంవత్సర ప్రారంభం నుండి ముగింపు వరకు ఉంచాలని ప్రార్థన చేద్దాము.

2011 ముగింపు దినాలలో స్పర్శ పాఠకులైన మీ అందరి జీవితములలో ప్రభువు గొప్ప కార్యములు చేయాలని రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు అయిన మన దేవుడు ప్రాణాత్మ దేహములను నూతనపరచాలని తద్వారా చక్కటి ఆరోగ్యము, ఆత్మానందముతో రాబోయే సంవత్సరములోనికి ప్రవేశపెట్టాలని మనమందరము ఏకమనస్సుతో ప్రార్థన చేద్దాము. ఆయన కనుదృష్టి మనందరి మీద ఉండును గాక !

స్పర్శ పాఠకులకు

క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసనతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం||ల నుండి సాయంత్రం 6.30 గం||ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 9666666249 | 040-24202227
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# క్రిస్మస్ కానుక

ఈ భూగోళం మీద ఉన్న సమస్త మానవాళి చరిత్రను రెండు భాగాలు క్రీస్తుపూర్వం, క్రీస్తుశకంగా చేసిన ఆరోజు, మన క్యాలెండర్‌లలో, కంపూటర్లలో కనిపించే తేదీలకు ఆధారమైన ఆరోజు క్రీస్తు యేసు పుట్టినరోజు, అసమానుడైన క్రీస్తు పుట్టిన ఆరోజును ప్రపంచమంతా పండుగగా ఆచరిస్తుంది. అయితే యేసుక్రీస్తు పుట్టుక ద్వారా ప్రతి మనిషికి దేవుడు సిద్ధపరచిన అమూల్యమైన బహుమానమును అనేక మంది గుర్తించలేకపోతున్నారు.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి రావడానికి గల కారణం ఏమిటో ఈ చిన్న ఉపమానం ద్వారా సులభంగా అర్థమవుతుంది. ఒకరోజు ఒక తండ్రి 7 సంవత్సరాల కుమారుడితో కాలువ గట్టున కూర్చుని ఉన్నాడు. ఆ కుమారుడు కాలువ ఒడ్డు అంచున ఉన్న చీమల గుంపును గమనిస్తూ ఆనందిస్తున్నాడు. నీటి ప్రవాహం పెరుగుతూ ఉండటంతో ఆ చీమలు నీటిలో పడి కొట్టుకుపోటే ప్రమాదం ఏర్పడింది. ఆ బాలుడు వాటి స్థితి చూచి చాలా బాధపడుతూ ఒడ్డుకు వచ్చేయండి లేకపోతే కొట్టుకుపోతారు అని అరుస్తున్నాడు. చీమలకు వినబడాలని ఎంచ అరిచినా ఫలితం శూన్యం. అప్పుడు తండ్రి కుమారునితో ఇలా అన్నాడు. “నువ్వు ఎంత అరిచి బాధపడినా ప్రయోజనం లేదు. చీమలు నీ భాష అర్థం చేసుకోలేవు. నీవు చీమగా మారితే వింటాయి. అప్పుడు కుమారుడు నేను చీమగా మారి వాటిని రక్షిస్తాను అన్నాడు. వాటిని రక్షించుకోవాలనే తపనతో ఆ బాలుడు అమాయకంగా మాట్లాడినా, సరిగ్గా అటువంటి నిష్కళ్మషమైన, నిస్వార్థమైన ప్రేమ దేవుని కుమారుడైన యేసును రక్తమాంసములు కలిగిన మనుష్యునిగా మన మధ్య జన్మింపచేసింది. దేవుడు మన భయాలను పోగొట్టి మన ఆత్మను విడిపించాలని తన సొంత కుమారుడిని మన కోసం మన మధ్యకు పంపించాడు. కన్య మరియ పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టింది. తండ్రి అయిన దేవుడు నీ యొక్క జన్మ, కర్మ పాపములను సిలువలో తన కుమారుని మీద మోపి మనలను విమోచనను సిద్ధపరిచాడు.

యేసు జన్మ పునీతమైనది, ఆయన గుణము సాటిలేనిది, ఆయన జీవితము విశిష్టమైనది. యేసు జన్మించుటకు 700 సం॥ల పూర్వమే ఆయన జన్మించే విధానం, జన్మస్థలం, సిలువ మరణము మరియు పునరుత్థానము గురించి దేవుడు స్పష్టమైనవివరాలను తన భక్తులద్వారా గ్రంథస్థం చేయించాడు. యేసును మించిన కారణ జన్ములు ప్రపంచ చరిత్రలో మరెవ్వరులేరు, ఇక ఉండబోరు. నీ జీవితానికి  జవాబు అయి ఉన్న యేసును, అమూల్యమైన క్రిస్మస్ బహుమానముగా దేవుడు నీ కొరకు పంపించాడు. దేవుని యొక్క బహుమానమును నీవు స్వీకరించి దేవుని దీవెనలను పొందుకొనగలవు.

# తార

- సిస్టర్ విజయ

నవంబర్, డిశంబర్ నెలలు అనగానే ప్రతి క్రైస్తవ కుటుంబములోనూ హడావుడి మొదలవుతుంది. క్రిస్మస్ పండుగ అని స్త్రీలు ఆర్భాటంగా, అట్టహాసంగా వేడుకలు జరుపుకోవాలని ఆశిస్తూ ఉంటారు. అయితే ఆయన జననము యొక్క ప్రత్యేకతను గుర్తించిన వారమైతే ప్రతి దినమూ ఇంట్లోనూ బయట పండుగ వాతావరణమును కలిగించవచ్చు.

యూదయ దేశపు బేత్లెహేములో యేసు పుట్టిన పిమ్మట ఇదిగో తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి, యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ నున్నాడు? తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయనను పూజింప వచ్చితిమని చెప్పిరి. (మత్తయి 2:1-2)



వారు రాజు మాట విని బయలు దేరి పోవుచుండగా ఇదిగో తూర్పు దేశమున వారు చూచిన నక్షత్రము ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచు వరకు వారికి ముందుగా నడిచెను. వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానంద భరితులై యింటిలోనికి వచ్చి తల్లియైన మరియను ఆ శిశువును చూచి, సాగిలపడి, ఆయనను పూజించి తమ పెట్టెలు విప్పి బంగారమును సాంబ్రాణిని బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి (మత్తయి 2:9-11).

ముఖ్యముగా ఇక్కడ మనము గమనించినట్లైతే క్రీస్తు పుట్టుకను కనపరచుటకు ఒక విశేష సూచనగా జ్ఞానులకు దారి చూపించిన నక్షత్రమును చూడగలము. సృష్టి ఆరంభమప్పుడు యెహోవా పగటిని ఏలుటకు పెద్దజ్యోతిని, రాత్రిని ఏలుటకు చిన్న జ్యోతిని నక్షత్రములను చేసెను. నక్షత్రములు చాలా ప్రకాశవంతమైనవి. ఒకచోట నుండి మరియొక

చోటికి ప్రయాణిస్తూ ఉంటాయి.  అవి మనకి పగలు కనిపించవు, రాత్రి పూట మాత్రమే కనిపించడానికిగల కారణం పగలు సూర్యుడు ఎక్కువ వేడిని, కాంతిని కలిగి ఉండుట వలన అవి ఆకాశంలోనే ఉంటాయి కానీ కనిపించవు.

మీరు లోకమునకు వెలుగైయున్నారు అని చెప్పబడిన ప్రభువు యొక్క మాటని బట్టి ఎల్లప్పుడూ ఆ నీతిసూర్యుడైన దేవుని వెలుగులో నిలిచి ఆ వెలుగును కుటుంబములలోను, అనేకుల జీవితములలోను పంచేవారిగా, శ్రమలోనూ, శోధనలోనూ కృంగిపోక మనలను మనమే కాపాడుకుంటూ, ఉజ్జీవపరచుకుంటూ,  క్రీస్తు యొక్క మాదిరిని, సజీవుడైన యేసుని మార్గమును చూపే వారిగా ఉండాలి.

ఒక చిన్నది ఇశ్రాయేలు దేశం నుండి బానిసగా వెళ్ళి తన యజమానికి ఒక మేలుకరమైన మార్గమును చూపి, ప్రకాశించే తారగా బైబిల్ గ్రంథములో నిలిచింది.

**సిరియనులు గుంపు గుంపులుగా బయలుదేరి ఇశ్రాయేలు దేశము మీదికి పోయి యుండిరి. వారచ్చట నుండి యొక చిన్నదాని చెరగొని తేగా అది నయమాను భార్యకు పరిచారము చేయుచుండెను. (2 రాజులు 5:2)**

సిరియా దేశము ఇశ్రాయేలు దేశమునకు విరోధమైనది. విగ్రహపూజ చేసే జాతి ప్రజల దేశము. ఈ నయమాను సిరియా దేశపు రాజు యొక్క సైన్యాధిపతి. అతని చేత యెహోవాయే సిరియా దేశమునకు జయము కలుగజేసియుండెను గనుక అతడు తన యజమానుని దృష్టికి ఘనుడై దయ పొందిన వాడాయెను. అతడు మహా పరాక్రమ శాలియై యుండెను గాని కుష్ఠరోగి. ఇది చర్మమునకు సంబంధించిన వ్యాధి. అతి వికారంగా, చూడడానికి అసహ్యంగా అత్యంత ప్రమాదకరంగా ఉండే ఈ వ్యాధికి మందు లేదు. పరమ వైద్యుడే దీనిని స్వస్థపరచగలరు. అప్పుడు ఆ దేశములో ఇశ్రాయేలు దేశము నుండి బానిసగా వెళ్ళిన ఆ చిన్నది తన యజమానురాలితో షోమ్రోనులో ఉన్న ప్రవక్త దగ్గర నా యేలినవాడు ఉండవలెనని నేనెంతో కోరుచున్నాను. అతడు నా యేలినవానికి కలిగిన కుష్ఠరోగమును బాగుచేయునని చెప్పెను. (2 రాజు 5:3) నయమాను రాజు నొద్దకు పోయి, ఆ చిన్నదాని మాటలను తెలియజేయుట ద్వారా, రాజు నొద్ద నుండి అనుమతి పొంది షోమ్రోనులో నున్న ఎలీషా ప్రవక్త వద్దకు వెళ్ళెను.



ఆ ప్రవక్త చెప్పిన మాట ప్రకారం నయమాను మొదట వ్యసనపడినప్పటికి, తరువాత అక్కడి యొర్దాను నదిలో 7 సార్లు మునుగుట ద్వారా పసిపిల్ల దేహము వలె మార్చబడి, శుద్ధుడై తన దేశమునకు తిరిగి వెళ్ళెను.

చూశారా ! బానిసగా కొనిపోబడిన ఆ చిన్నది ఇది నా పని కాదు, నేను దాసిగా వచ్చాను అని మౌనముగా ఉండలేదు. యజమానుని క్షేమమును కోరుకుని, మంచి దారిని చూపడానికి ఇష్టపడింది. దేవుని ఎరుగని ఆ దేశములో ఇశ్రాయేలు దేవుడైన ప్రభువు యొక్క నామమును ఘనపరిచింది. తాను ఉన్న బానిస బ్రతుకులో తన నోటి మాట ద్వారా యజమానుని కుటుంబములో సంతోషము నింపింది.

అదే విధముగా యెరూషలేము నుండి చెరపట్టబడిన షద్రకు, మేషాకు, అబెద్నగోలు, దానియేలు అను యౌవనస్థులు బానిసలుగా వెళ్ళిన ఆ బబులోను ప్రాంతములో వారికి వ్యతిరేకముగా ఎన్ని శాసనములు చేయబడిననూ దేవుని నామమును మహిమపరచవలెనన్న ఒక దృఢనిశ్చయంతో నిలిచారు. తద్వారా ఆయన నామమును రాజ్యమంతటికి తెలియపరచిన నక్షత్రములుగా ప్రకాశించారు.

కాబట్టి ప్రియ సహోదరి ! స్త్రీలమైన మనము అనేకులకు సజీవుడైన దేవుని యొక్క మార్గమును మన, జీవిత విధానముల ద్వారా ప్రతిబింబింప చేసే నక్షత్రముల వలె ఉండవలసిన వారమై యున్నాము. ఆయన జననము ఒక రోజుతో జ్ఞాపకం చేసుకొని ముగించేది కాదు, నా కొరకు ఈ లోకములోనికి వచ్చాడు అని దినదినమూ జ్ఞాపకం చేసుకుంటూ, జ్ఞానులకు దారి చూపిన నక్షత్రము ద్వారా వారు ఆయనకు కానుకలర్పించి, పూజించి, ఏ విధంగా ఆరాధించారో మనము మన నశించుపోతున్న ప్రజలకు మన కుటుంబములకు మంచి దారిని చూపించే నక్షత్రములుగా ప్రకాశించాలని ఆకాంక్షిస్తూ .....

అట్టి ధన్యత దేవుడు మనకు దయచేయును గాక !

ప్రియ సహోదరీలకు

**క్రిస్మస్** మరియు **నూతన సంవత్సర శుభాకాంక్షలు.**

# మూర్ఖు(రా)లు

మూర్ఖుడు అనే మాటని ఆయా సమయములలో మనుష్యుల నోట మనము వింటూ ఉంటాము. మూర్ఖులు అనబడేవారు తాము చేయు పనులను బట్టియూ, వారి మాటలను బట్టియూ తెలియపరచబడతారు. చేసే పనులు, మాట్లాడే మాటలు తప్పు అని ఎంతమంది చెప్పినప్పటికి, ప్రవర్తనని మార్చుకొనకుండా కొనసాగేవారిని మూర్ఖులు అంటారు. మూర్ఖులు జ్ఞానుల ఉపదేశమును తిరస్కరించెదరు. (సామె 1:7)

మూర్ఖత్వముతో ప్రవర్తించువారు తమ చుట్టూ ఉన్నవారికందరికి ఇబ్బందిని కలిగించేవారిగా ఉంటారు. ప్రతి మనుష్యుడు తన జీవితములో అనేక బాధ్యతలతో కూడిన పాత్రలను పోషించవలసి ఉంటుంది. ఉదాహరణకు కుమారుడు, కుమార్తె, భార్య, భర్త, తల్లి, తండ్రి, పనివాడు, యజమాని, పొరుగువాడు.

మూర్ఖత్వముతో జీవించు వాని వలన అన్ని పాత్రలకు తీరని అన్యాయం జరుగుతుంది. ఈ స్వభావము అనేక వ్యసనముల కంటే ప్రమాదకరమైనది. చూడడానికి చాలా మంచివారిగా కనబడుతూ, అందరి మధ్య తిరుగుతూ ఉన్నట్లుగా అనిపించినప్పటికి, వారి జీవితములలో ఉన్న మూఢత వలన అనేకులు నష్టపోతూ ఉంటారు. మూర్ఖుని మూఢత వాని కనులకు పొరల వంటిది. వారేమి చేస్తున్నారో, దాని వలన ఎంత నష్టం కలుగుతుందో, ఏ మాత్రమూ గ్రహించలేని వారిగా ఉంటారు. విచిత్రమైన విషయమేమిటంటే మూర్ఖులకు తమ మార్గము తమకి సరియైనదిగా కనబడును. మూఢుని మార్గము వాని దృష్టికి సరియైనది (సామె 12:15)

మూర్ఖపు ప్రవర్తన కలిగిన మనుష్యుల వలన మానవ సంబంధములు దారుణంగా దెబ్బతింటాయి. వారు ఎవ్వరినీ నెమ్మదిగా ఉండనివ్వరు. వారి విపరీత ప్రవర్తన ఇంట్లో భార్యను, పిల్లలను భయోత్పాతానికి గురి చేస్తాయి. అలాగే ఒక మూర్ఖురాలి వలన ఇంట్లో భర్త, పిల్లలు జీవచ్ఛవములుగా బ్రతుకుతూ ఉంటారు. మూఢురాలు తన చేతులతో తన యిల్లు ఊడబెరుకును (సామె 14:1)

మూఢుని రోటిలోని గోధుమలలో వేసి రోకట దంచినను వాని మూఢత వాని వదిలిపోదు (సామె 27:22) బైబిల్ గ్రంథములోని ఈ మాటకి అర్థం ఎన్ని దెబ్బలు కొట్టిననూ, ఎందరు ఎంత బుద్ధి చెప్పిననూ మూర్ఖుని మూఢత వదిలిపోదు.

మనము మూర్ఖులుగా పిలవబడకుండా జీవించాలంటే మనము చేసేదే కరెక్ట్ అని ఎప్పుడూ అనుకోకుండా ప్రతి వ్యక్తి యొక్క సలహాలను పరిగనలోనికి తీసికొని మంచి చెడ్డలను వివేచించుటకు సమయమును కేటాయించుకొని, ప్రతి విషయములోను ఆత్మ విమర్శ చేసుకుంటూ ముందుకి వెళ్ళాలి. మనలను మనం నియంత్రించుకోలేని విషయములలో దేవుని సహాయము కొరకు ప్రార్థన చేయడం ద్వారా దేవుని యొద్ద నుండి ఆశ్చర్యకరమైన సహాయమును మనం పొందగలం.

ప్రభువైన యేసుక్రీస్తు మనుష్యులను వారి మూఢత్వం నుండి విడిపించడానికి పరలోకము నుండి భూమి మీదకు వచ్చి మనలో ఒకని వంటి వాడిగా జీవించి, మానవులను వారి మూర్ఖత నుండి విడిపించడం జరుగుతుంది.

ఇది చదువుతున్న వారి జీవితములను మూర్ఖత్వం నుండి విడిపించును గాక!

**- ఎడిటర్**



**క్రిస్మస్ మరియు**

## నూతన సంవత్సర ఆరాధన

**క్రిస్మస్ ఆరాధన సమయం:**
డిసెంబర్ 25,
ఉదయం గం. 10.00 లకు

**నూతన సంవత్సర ఆరాధన సమయం:**
డిసెంబర్ 31,
రాత్రి గం. 9.00 లకు

**వివరములకు:**

**బ్రదర్. ప్రేమ్ కుమార్**

**9666666249, 040-24202227**

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

– సీరియల్ 19వ భాగము



యౌవనుడైన సుందర్‌ని చూచినప్పుడు శరీర బలహీనతతో కదలలేని స్థితిలో పడియుండడాన్ని గమనించాడు స్టోక్స్. కొంచెం విశ్రాంతి దొరికి ఏదైనా ఒక స్థలమునకు సుందర్‌ని తీసికొని పోవాలని స్టోక్స్ ప్రయత్నించాడు. ఆ దగ్గర్లోనే ఐరోపా దేశస్తుడొకడున్నాడని తెలిసికొని వెళ్ళి అతని సహాయ మర్థించాడు. భారత దేశపు సాధువు వలె కాషాయ వస్త్రములు ధరించి అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడుచున్న ఈ తెల్లాయనను చూచినప్పుడు ఆ ఐరోపా దేశీయుడేమనుకున్నాడో తెలియదు గాని స్టోక్స్‌గారి మనవి నంగీకరించి సహాయం చేయడానికి ముందుకు వచ్చాడు. సుందర్‌ని అతని ఇంటికి చేర్చారు. విశ్రాంతి, మంచి భోజనము, కావలసిన వైద్యము దొరకడంతో సుందర్ త్వారగా కోలుకున్నాడు. మరింత త్వరలోనే సుందర్, స్టోక్స్‌లు తమ కార్యకలపాలను పునరారంభించారు. అయితే ఐరోపా దేశస్తుని ఇంటిలో వారు కొద్ది రోజులు ఉండిన ఫలితముగా అతడు క్రీస్తునందు విశ్వాసముంచి మేలు పొందాడు.

తరువాత సబాతుకు తిరిగి వచ్చి అచటి ఆసుపత్రిలో కుష్ఠరోగులకు సహాయం చేయాల్సిరావడంతో వారిరువురు ఆ పనిలో నిమగ్నమైపోయారు. ఇదే సమయంలో మైదాన పట్టణాల్లో ప్లేగు వ్యాధి ప్రబలడంతో అచ్చటి రోగులకు, చావసిద్ధమై యున్న వారికి సేవచేసేందుకే వీరు అచ్చటికి వెళ్ళారు. స్టోక్స్, సుందర్‌లు కలిసి పనిచేయడం అదే ఆఖరిసారి. ఆ తరువాత వారిరువురి మధ్య సంబంధాలు కొనసాగినప్పటికిని వేసవిలో అంగవికలురైన బాలురను కొద్ది కాలం కొండ ప్రాంతంలోనికి తీసుకొని వెళ్ళడంతో కలిసి పని చేసినప్పటికిని వారి దారులు మాత్రం వేరైపోయాయి. స్టోక్స్‌గారు అమెరికా ఇంగ్లండ్ దేశములకు వెళ్ళి ఫ్రాన్సిస్‌గారి పద్ధతిలో భారతదేశంలో సేవచేసేందుకై యౌవనులను సమకూర్చుకోనారంభించాడు. అయితే సుందర్ బాప్తిస్మం తీసుకునే కాలంలో తన హృదయంలో వచ్చిన ప్రేరేపణకు ప్రతిస్పందిస్తూ హిమాలయములకు ఆవల నున్న టిబెట్‌కు తరలిపోయాడు.

టిబెట్ సేవ ప్రారంభము – మానవుని ఎంతో పురిగొల్పి భూలోకంలో వాని ప్రయత్నములకు టిబెట్ ప్రాంతం పెనుసవాలుగా నిలిచిందనవచ్చు. ఒక వైపున లక్షలాది

భారతీయుల ప్రవేశాన్ని నిరోధిస్తూ పెట్టని కోట గోడవలె నున్న హిమాలయాలు, తూర్పువైపున విస్తార జనాభా గల చైనా వారిని అడ్డుకొంటూ వందలాది మైళ్ళ విస్తీర్ణమున్న పీఠభూమి కలిగిన అబేధ్య దుర్గం టిబెట్. ఇలాంటి టిబెట్‌కే వెళ్ళాలని సుందర్ ఎంతో ఆశించాడు. ఔత్సాహికులైన పర్వతారోహకులు, సాహసవంతులైన పరిశోధకులు ఈ ప్రాంతాన్ని పరిశోధించాలనుకున్నారు. రాజకీయవేత్తలు దీనిపై ఎన్నో ఒడంబడికలు చేశారు. అయితే క్రీస్తు నామం అక్కడ స్థాపించడానికి కష్టతరమైన ప్రయత్నాలు చేసిన వారిని వేళ్ళ మీద లెక్కించవచ్చు.

చైనా వాయువ్య ప్రాంతం నుండి సంవత్సరమున్నర పాటు దీర్ఘప్రయాణం చేసి ఏబ్బెస్‌హుక్, గాబెటులు 1846లో లాసాకు చేరారు. మానవాళి రక్షణార్థమై క్రీస్తు సిలువ వేయబడినాడని ప్రకటించాలన్నదే వారి ఆశయం. టిబెట్ దేశీయులు వారిని ఎంతో సాదరంగా ఆహ్వానించి నప్పటికిని రెండు నెలల తర్వాత లాసాను విడిచి వెళ్ళమని వారిని బలవంతం చేశారు. దీనికంతటికి చైనా దేశ రాయబారే కారకుడైనప్పటికిని, రాజ్య సింహాసనమునకు స్థావరంగా ఏర్పరచుకున్న దేశం నుండి మమ్మును నెట్టివేయాలని మా పురోభివృద్ధిని నిరోధించాలని గట్టిగా ప్రయత్నించింది, సమస్త మేలుకు విరోధియైన సాతానేనని ఎబ్బేస్ గుర్తించాడు. 50 ఏళ్ళ తరువాత కెనడాకు చెందిన డా.సుశీరిజన్‌హార్ట్ ఆమె భర్త వాయువ్య చైనాలోని కబంలోని సన్యాసుల మఠమొక దానిలో ఒకటి రెండేండ్లుండి తమ చిన్న కుమారునితో టిబెట్‌కు ప్రయాణమయ్యారు. ఈ ప్రయాణంలో చెప్పనశక్యమైన అపాయములను, కష్టములను ఎదుర్కొని వెళ్ళి చివరకు ఆ డాక్టరమ్మ గారొక్కరే తిరిగి వచ్చారు. ఇంత ప్రయాసతో వెళ్ళి వచ్చి ఆమె సాధించిందేమీ లేదన్నట్లుగా కనబడినప్పటికిని ఆమె కథ విన్నవారిలో అనేక మంది ఉత్తేజితులై టిబెట్‌కు పోవాలనే నిర్ణయమున కొచ్చారు. అదే సమయంలో చైనా ఇన్ లాండ్ మిషను వారు, క్రిస్టియన్ మిషనెరీ అలయన్స్ వారు చైనా టిబెట్‌ల సరిహద్దుల వైపు చేరుచుండినారు. చైనా వారును, అచ్చటి కొండ జాతి ప్రజలను వారి సందేశమును అంగీకరించినప్పటికిని అసలైన టిబెట్‌వారికి సువార్త నందించాలనే ప్రయత్నాలు సారిసారికి విఫలమయ్యాం.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)

# శ్రద్ధ



పిల్లలూ ఎలా ఉన్నారు? అక్కయ్య ఏం Story వ్రాస్తుందా అని ఎదురు చూస్తున్నారు కదూ! నేను కూడా మిమ్మల్ని ఈ స్పర్శ Magazine ద్వారా ఎప్పుడు కలవాలా అని ఎదురుచూస్తున్నాను. మీరు పెద్దవారైన తరువాత దేవునికి, దేశానికి ఉపయోగపడే వ్యక్తులుగా చూడాలని ఆశ. తప్పక అలా అవుతారుగా ....?

మీ తల్లిదండ్రుల భవిష్యత్తు అంతా మీరు అని గుర్తుంచుకోండి. కోటి ఆశలతో మిమ్మల్ని పెంచుతున్నారని మరువకండి. మీలో శారీరక ఎదుగుదలే కాదు మానసికంగా కూడా చక్కగా ఎదగాలి. మానసిక ఎదుగుదల ఆహారాన్ని బట్టి కలుగదు గానీ, దేవుని బుద్ధి వాక్యాన్ని నేర్చుకోవటం ద్వారా జరుగుతుంది. బాలుని హృదయంలో మూఢత్వము స్వాభావికంగా పుట్టును. శిక్షాదండము దానిని వానిలోనుండి తోలివేయును. బాల్యంలో అంటే మీ వయస్సులో కొంచెం మొండితనం, మూర్ఖత సహజంగా ఎవరిలోనైనా ఉంటాయి. అందుకే పెద్దవాళ్ళు వద్దు అన్నది చెయ్యాలి అన్పిస్తుంటుంది, చెయ్యమన్నది చెయ్యాలనిపించదు కదా ! పిల్లలూ ...

పెద్ద వాళ్ళు మిమ్మల్ని శిక్షించి బుద్ధి చెప్పినా వారిని తృణీకరించకండి, మీ మంచికే వాళ్ళు మిమ్మల్ని శిక్షించేది అని గుర్తుంచుకోండి. మీరు వృద్ధిలోనికి రావాలని తప్ప వేరే ఉద్దేశాలు వారికి ఉండవు సరేనా !!!

రమేష్ అనే అబ్బాయి స్కూలులో అందరితో గొడవపడుతూ ఉండేవాడు. ఎవరి మాటా వినేవాడు కాదు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా చదువుకోవటానికి ఇష్టపడేవాడు కాదు. ఆటలు, గొడవలే అతని ప్రపంచం. అనుకోకుండా ఒకరోజు వాళ్ళ నాన్నగారికి Accident అయి Hospital లో Join అయ్యారు. ప్రతిరోజు భోజనం క్యారియర్ పట్టుకుని Hospital కి వెళ్తూ వస్తూ ఉండేవాడు. కొన్నిరోజులు ఇలా తిరుగుతూ ఉండేసరికి రమేష్‌కి ఒకటే ఆలోచన??? రోడ్డు మీద కొందరు నడుచుకుంటూ, మరి కొందరు సైకిలు, బైకు, కారు ... ఇలా రకరకాలుగా ప్రయాణాలు చేస్తున్నారు. వ్యక్తులకి వ్యక్తులకి ఎంతో తేడా !!! కొందరు తమ దర్పాన్ని ప్రదర్శిస్తే మరికొందరు చాలా చింపిరిగా ఉన్నారు. వీటిని పరీక్షిస్తూ అందరూ మనుషులే కదా ఎందుకు ఈ తేడా అని తీవ్రంగా ఆలోచించేవాడు. చిన్న

మనస్సుకి ఏమీ అర్థం కాలేదు.

వాళ్ళ పక్కింటిలో ఉన్న కిషోర్ అంకుల్‌తో “మనుష్యులందరూ ఒక్కటే కదా! వారి వారి జీవితాలలో ఇంత తేడా ఏమిటి ?” అని అడిగాడు. అప్పుడు కిషోర్ అంకుల్ ఏమీ లేదు చాలా సింపుల్... వాళ్ళ వాళ్ళ పనులలో కష్టపడి పనిచేసే వాళ్ళు కొందరు, ఏ పనిని శ్రద్ధగా చేయనివారు కొందరు అని చెప్పటం జరిగింది. శ్రద్ధగా పనిచేయువాడు ఐశ్వర్యవంతుడు అవుతాడు. బద్ధకస్తుడు దరిద్రుడు అవుతాడు అని బైబిల్‌లో వ్రాయబడి ఉంది.

రమేష్ తన భవిష్యత్తును ఆలోచించి చాలా భయపడ్డాడు అప్పట్నుండీ చాలా శ్రద్ధగా చదవటం ప్రారంభించాడు. స్కూల్‌లో అన్ని Subjects మీద అవగాహన పెంచుకున్నాడు. స్కూల్‌లో First Ranker కాదు గానీ తెలివైన పిల్లవాడని అనేవారు. చివరికి పెద్దవాడై మంచి Business Man అయ్యాడు. అందరి యెడల ప్రేమ కలిగి ఉండేవాడు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేవాడు. అందరూ అతని గుణాన్ని బట్టి ఎంతో మెచ్చుకునేవారు.

చూశారా పిల్లలూ! చిన్న సంఘటన రమేష్ జీవితాన్ని ఎలా మార్చేసిందో!. మనం ప్రతి దినము మన కన్నులతో చూస్తున్న వాటిని, చెవులతో వింటున్న మాటలు ఎన్నడూ తేలికగా తీసుకొనకూడదు. ప్రతి దానిని జాగ్రత్తగా ఆలోచిస్తే మన జీవితకాలమంతటికి కావలసిన అనుభవాలను సంపాదించుకోవచ్చును. ప్రతి విషయాన్ని ఆలోచించే మనస్తత్వం రమేష్‌ది. రోడ్డు మీద వెళ్తున్న మనుష్యులలో ఉన్న వ్యత్యాసాన్ని చూసి తన జీవితాన్ని మార్చుకోవడానికి దానిని ఉపయోగించుకున్నాడు. మీరు కూడా ప్రతి సంఘటన ద్వారా మంచిని నేర్చుకోవడానికి ప్రయత్నిస్తారు కదా!. ఇలా నేర్చుకుంటూ వెళితే జీవితములో ఉన్నత స్థానములకు చేరతారు. God Bless You.

**My Dear Childrens**

**క్రిస్మస్**

**మరియు**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు....**

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు" - ఫిలిప్పు

నా పేరు పి.వి.రమణ, ఊరు కర్నూలు, నేను 10వ తరగతి చదువుతూ, చదువు మీద శ్రద్ధ లేక మధ్యలో మానేశాను. తరువాత ఆటోడ్రైవర్‌గా ఆటోని నడుపుతూ స్నేహితులతో కలసి చెడు అలవాట్లు నేర్చుకున్నాను. ఆ తరువాత హైదరాబాద్‌కు వచ్చి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ, ఇక్కడ నన్ను అడిగేవారు లేరు గనుక దురలవాట్లకు బానిసనైపోయాను. వీటి నుండి విడుదల పొందాలని, వివాహం చేసుకున్నాను. అయిననూ నాలో మార్పు రాలేదు కానీ క్రొత్త సమస్యలు మొదలయ్యాయి. భార్యతో గొడవ పడడం, పేకాట ఆడడం అలవాటుగా మారిన సమయములో ఒకరోజు మా అక్క యేసుప్రభువు గూర్చి నాకు చెప్పింది. ఆ రోజు వరకు యేసుప్రభువు అంటే మన దేవుడు కాదు అని నాకు తెలిసిన సత్యం. అయితే ప్రభువు నన్ను ప్రేమిస్తున్నాడు అని, నా కొరకు సిలువలో మరణించాడు అని నేటి వరకు ఆయన జీవించే యున్నాడు అని, అర్థం చేసుకున్న తరువాత నమ్మి బాప్తిస్మం పొందాను. సంవత్సరములు గడుచుచున్న కొలది నేను నడుస్తున్న మార్గములో సరిగా జీవించని కొందరి జీవితములు చూచి దేవునికి దూరమై కొంత కాలం మందిరమునకు వెళ్ళకుండా ఉన్నాను.

2005వ సంవత్సరం క్రిస్టమస్ రోజున నేను దేవునికి దూరమయ్యాను అని నాలో నేనే కుమిలిపోయాను. నా హృదయాలోచనలు ఎరిగి నన్ను ప్రేమిస్తున్న ప్రభువు 2006వ సంవత్సరం జనవరి 1వ తేదీన ఆదివారము భాగ్యలత కాలనీ ఎపఫ్రా మినిస్ట్రీస్ చర్చికి నడిపించారు. అక్కడ ఒక చిన్న ఇంటి మీద కొన్ని రేకులు వేసి ఉన్నాయి. కూర్చోవడానికి, కారు ఆపుటకు కూడా స్థలము లేదు. ఇది ఏమి చర్చి అని నాలో నేను సణుగుకుంటూ కూర్చున్నాను. ఇంతలో బ్రదర్ ఎపఫ్రా గారు వచ్చి ఆరాధన నడిపిస్తున్నప్పుడు పరిశుద్ధాత్మ దేవుని సన్నిధిని నేను అనుభవించాను. ప్రతివారము వచ్చి వెళుతున్నాను. అప్పటి చిన్న మందిరమునకు నేను కారులో వచ్చిననూ నన్ను ఎవరూ ప్రత్యేకంగా చూసేవారు కాదు. ఎవరి పని వారు చూసుకోవడం, గ్రూపులు, కలహాలు లేకుండా ఉండడం నేను గమనించి, నా భార్య పిల్లలను కూడా తీసికొని దేవుని మందిరమునకు రావడం జరిగింది. మార్కు సువార్త 5వ అధ్యాయములో అపవిత్రాత్మ పట్టిన వాడు తనను తాను రాళ్ళతో గాయపరచు కొనుచుండెను అని చెప్పబడినట్లుగా నా జీవితమును సిగరెట్లు, గుట్కాలు మత్తుపదార్థములు, వ్యసనములతో శరీర అవయవములను పాడుచేస్తున్న అనేక దయ్యముల నుండి ప్రభువు నన్ను విడిపించారు.

మనుష్యులందరి దృష్టిలో మంచివాడిగా నటింపజేసి, వ్యభిచార పాపములోకి నడిపిస్తున్న దురాత్మల నుండి విడిపించారు. నేను త్రాగుచూ, పేకాట ఆడుతున్నప్పుడు మధ్యలో నా భార్య భోజనమునకు పిలిచినప్పుడు భయంకరమైన కోపంతో ఇంట్లోని వస్తువులను పగలగొట్టి భీభత్సం సృష్టించేవాడిని. అట్టి భయంకరమైన కోపము, ఎవ్వరికీ కనబడని చెడు

ఆలోచనలు, తలంపులు, ఊహలు, ద్వేషము, పగ, గర్వము, స్వనీతి, లోబడని, క్షమించలేని స్థితి, లాంటి వాటితో నింపబడిన నా హృదయం మీద నిష్కళంకమైన ఆయన రక్తమును ప్రోక్షీకరించి, రక్షించి, ఈ సృష్టిలో ఏ వ్యక్తి, శక్తి తప్పించలేని నరకాగ్ని నుండి తప్పించారు. ఈ లోకంలో ఎన్నో కోట్లు పెట్టి అయినా కొనలేని విలువైన పరలోక రాజ్యమును దేవుడు నా ఆత్మకు అనుగ్రహించారు. ఇన్ని భయంకరమైన వ్యసనములతో పశువు వలె ప్రవర్తిస్తున్న నన్ను ఈ భూమి మీద అందరికంటె ఎక్కువగా భరించింది నా భార్య. అంతే కాక సమాధానము కలిగి నా కుటుంబముతో కలిసి జీవించే కృపను, దైవసేవకుల ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు మాట్లాడే మాటలను గ్రహించే హృదయమును, లోబడే మనస్సును అనుగ్రహించారు.

ఒకప్పుడు చిన్న రేకుల షెడ్డులో ప్రారంభమైన ఈ పరిచర్య ఇంతగా విస్తరించడానికి కారణం సంఘమంతా కలసి ఏకమనస్సుతో చేస్తున్న ఉపవాస ప్రార్థనలు, ధనాపేక్ష హృదయం లేనివారై దేవుని చిత్తానుసారముగా ఆయన నీతికి లోబడి, నశించిపోతున్న ఆత్మలు రక్షించబడాలన్న తపన కలిగి ధనిక, దరిద్ర బేధములు లేకుండా ఐక్యతతో జీవిస్తున్న వీరిని బట్టి అని నేను గ్రహించాను. అప్పుడు నా మట్టుకు నాకు బ్రతికితే క్రీస్తు కొరకు బ్రతకాలి అనే కోరిక కలిగింది. ఇంతగా నన్ను ఆదరించి ప్రేమించిన ఈ పరిచర్యను నాకు పరిచయం చేసిన కుటుంబములకు దేవుని కృప తోడై ఉండాలని నా ప్రార్థన.

ఇదియు గాక మొదట ప్రభువునకును, దేవుని చిత్తము వలన మాకును తమ్మును తామే అప్పగించుకొనిరి (2 కొరింథి 8:5) ఈ వాక్యప్రకారము దేవుడు నాకు ఇచ్చిన ఈ పరిచర్యకు నన్ను నేను అప్పగించుకొని జీవించే కృప పరిశుద్ధాత్మ దేవుడు నాకు అనుగ్రహించాలని నా కొరకు ప్రార్థన చేయగలరని హృదయపూర్వకముగా మిమ్మును కోరుచున్నాను.



# ఇది సమయమా ... ?

ఈ సృష్టి అంతమునకు అనగా దేవుని రెండవ రాకడకు దేవుడు చెప్పిన సూచనలు ఒక్కొక్కటి నెరవేరుతున్నాయి దేవుని వాక్యము **ఆ దినము భూమియందంతట నివసించు వారందరి మీదికి అకస్మాత్తుగా వచ్చును. అని స్పష్టంగా తెలియజేస్తుంది. (లూకా 21:35)**

అయినప్పటికీ మనుష్యులు స్పర్శలేని కుష్ఠరోగులవలే ... తమ ఆత్మ విషయమై ఆలోచన లేకుండా వారి ఇష్టానుసారంగా జీవిస్తూ క్రీస్తుని వారు అంగీకరించకుండానే మరణిస్తున్నారు. ఫలితంగా అనేకమంది నిత్య నరకానికి వెళ్ళిపోతూ ఉన్నారు. ఇది నాణానికి ఒక ప్రక్క అయితే మరొక ప్రక్క క్రీస్తుని ఎరిగిన చాలా మంది ఇంకనూ ఈ లోక సంబంధమైన ఆశీర్వాదాలు ...ధనము, వెండి, బంగారం, ఇల్లు, స్థలాలు, కార్లు మొదలైన విలాసవంతమైన జీవితం కొరకు ప్రాకులాడుతూ వున్నారు. ఒక ప్రక్క పరిశుద్ధ గ్రంథం ధనవంతుడు పరలోకరాజ్యం చేరటం అంటే ఒంటె సూది బెజ్జంలొ చేరటం అంత కష్టమని నొక్కి వక్కాణించి చెబుతున్నప్పటికి... ఇంకను దేవుని పిల్లలు భూసంబంధమైన ఆశీర్వాదాల కొరకు దేవుడు ఇస్తున్న దీర్ఘాయువును పరసంబంధమైన ప్రయోజనాలకు బదులు భూసంబంధమైన ప్రయోజనాలకే అన్నట్టు క్షయమైన వాటికే ఎక్కువ ప్రాదాన్యతనిస్తూ దీర్ఘ ప్రార్థనలు చేస్తూ.. చేయిస్తూ.. మిక్కిలి ఆయాసంతో.. ప్రయాస పడుతూ... దేవుడిస్తున్న విలువైన సమయాన్ని దుర్వినియోగం చేస్తూ.. వున్నారు.

ఒకవేళ దేవుడు పరలోకం విడిచి పెట్టకూడని భాగ్యమని తలంచినట్లయితే నీవు, నేను యేసుక్రీస్తుని అంగీకరించి, రక్షణ పొంది యుండేవాళ్ళమా ...? పరలోకరాజ్యం వెళ్ళే నిరీక్షణ కలిగి యుండేవాళ్ళమా ...? పరిశుద్ధుడు, సర్వశక్తిమంతుడు, జ్ఞానానికి మూలమైన దేవుడు, ప్రేమామయుడు, దయామయుడు...సర్వమానవాళిని (భూదిగంతములలో వున్న ప్రజలందరిని) సర్వసత్యంలోనికి నడిపించడానికి సమస్తమును విడిచిపెట్టి.. పాపుల మధ్యలోనికి వచ్చి తన ప్రాణమును సైతం పాపులమైన మనకొరకు అర్పించి సమాప్తమైనది. (యోహాను 19:30) అని చెప్పి తాను చేయవలసినది పూర్తి చేసియుండగా... క్రైస్తవులు, విశ్వాసులు, యేసుక్రీస్తుని ప్రేమ సంబంధులు అనగా దేవుని పిల్లలు అని పలు రకములుగా పిలవబడుతున్న.. మనకు ఇది సమయమా... ఎలీషా గేహజీతో చెప్పినట్టు.. (2 రాజులు 5:26)

మనం దేవుని కృపను బట్టి కలిగియున్న విశ్వాసమును అశాశ్వతమైన భూసంబంధమైన వాటి కొరకే వాడుకుంటూ ఒక ప్రక్క దేవుని వాక్యము (కొలస్సీ 3:1,2) లో

మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి. పైనున్న వాటి మీదనే గాని, భూసంబంధమైన వాటి మీద మనసు పెట్టుకొనకుడి. అని దేవుడు ఘోషిస్తున్నప్పటికి నీ విలువైన జీవితకాలాన్ని దుర్వినియోగం చేయడం ఎంత వరకు న్యాయమో నిష్కపటమైన దేవుని మనసుతో ఆలోచించగలవా...

**ప్రియ సహోదర, సహోదరీ నీకు తెలుసా ....?**

ప్రతి దినము కొన్ని లక్షలు, కోట్ల మంది మనుష్యులు యేసుక్రీస్తును అంగీకరించకుండా నిత్య నరకానికి వెళ్ళిపోతున్నారని దీనికి కారణం క్రైస్తవుల నిర్లక్ష్యమేనని ఈ క్రింది గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి.

1. మన దేశ జనభా..... 120 కోట్లు పై మాటే..

2. ప్రతి గంటకు మన దేశంలోని జననాల సంఖ్య.... 1,768

3. 50 శాతం జనాభా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రాలలోనే వున్నారు అనేది ఎంతో వాస్తవం.

4. దేశంలో ఎక్కువ శాతం ప్రజలు మరణిస్తున్న రాష్ట్రాలు... ఉత్తరప్రదేశ్, జార్ఖాండ్, ఛత్తీశ్ఘడ్, మరియు అస్సాం.

5. దేశంలో ఎక్కువ శాతం ప్రజలు జన్మిస్తున్న రాష్ట్రం మధ్యప్రదేశ్

ప్రభువునందు ప్రియమైన సహోదర, సహోదరీ నీ పొరుగువారు ఆపదలో వున్నారని, వారు నరకానికి ప్రయాణమై పోతున్నారని తెలిసినప్పటికీ ఎంత కాలం ఆత్మలో స్పర్శలేని నామకార్థ క్రైస్తవునివలే వేషధారులవలే పెదవులతో అలవాటుగా, భారం లేకుండా, వ్యర్థమైన ఆచార ప్రార్థనలు చేసెదవు ?

నీకు తెలుసా...? నేను, నీవు రక్షింపబడటానికి ముందు దేవుని మహా కృపనుబట్టి ఎంత మంది ఎన్ని విధాలుగా దేవుని ప్రేమను బట్టి ప్రభువు నందు ప్రయాసపడ్డారో...? నీవు ఎప్పుడైనా ఆలోచించావా ....?

(ఇంకా వుంది)

# రూపాయి, యూరో, పౌండ్, డాలర్



**ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములను, హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము (1 తిమోతి 6: 9,10)**

అట్టివి మనుష్యులను నష్టములోను, నాశనములోను ముంచివేయును అని వ్రాయబడిన మాటని బట్టి ధనాపేక్ష వలన మనుష్యులకు కలుగుచున్న నష్టములు అన్నీ ఇన్నీ కావు. మానవుని జీవితమును కోలుకోలేని విధముగా దెబ్బతీస్తున్నాయి. ముఖ్యముగా ధనాపేక్ష విషయంలో క్రీస్తుని ఎరిగిన వారి జీవితములను పరీక్షిస్తే, దేవుని కంటే ధనసంబంధమైన విషయములకు విలువనివ్వడం ద్వారా ప్రజలు దేవుని మీద తిరుగుబాటు చేయడం కనిపిస్తుంది. అందుకే దేవుడు తన ప్రజలకు వారి సంపాదన అంతటిలో పదియవ వంతు ఆయన మందిరపు ధననిధిలోనికి తెమ్మని చెప్పడం జరిగింది (ద్వితీ14:22). ఇది పాత నిబంధనా క్రమమైతే నూతన నిబంధనలో అంతకంటే ఎక్కువగా అనగా త్యాగముతో జీవించమని అనేక సందర్భములలో ప్రభువైన యేసుక్రీస్తు, ఆయన శిష్యులు హెచ్చరించడం జరిగింది. నిజముగా ఎంతమంది దేవుని భాగములో అయిన పదియవ వంతు, ప్రథమ ఫలము, ప్రతిష్ఠార్పణలలో నమ్మకముగా ఉంటున్నారో తమ్ముని తాము పరీక్షించుకొనవలెను.

నేటి దినములలో క్రైస్తవులుగా చలామణి అవుతున్న వారిలో కొందరు తమ ధనముని దేవునికి ఎంతమాత్రమూ ఇచ్చేవారిగా ఉండరు. వారి కడుపే వారికి దేవుడు అన్నట్లుగా జీవిస్తూ, ధనాపేక్ష మత్తులో తూలుతూ ఉంటారు. ఇలాంటివారు ఎంత నష్టపోతున్నారంటే దేవుని డబ్బుని దొంగిలించి, శాపగ్రస్తులుగా మారుతున్నారు. (మలాకీ 3:8,9) తరువాత వారి అవస్థలు చూస్తుంటే ఎంతో బాధ కలుగుతుంది. మరికొందరు దేవునికి చెందవలసిన డబ్బుని తమకి పేరు, ప్రతిష్ఠలు తెచ్చేవాటికి ఖర్చుపెడుతూ ఉంటారు. అనగా దశమభాగములతో టి.వి.ప్రోగ్రామ్స్ స్పాన్సర్ చేస్తూ, చాలా గొప్ప పని చేశామని సంతోషపడతారు. ఇది ఎంతో అవివేకం. పదియవ వంతు అనగా దశమ భాగం దేవుని మందిరమునకు తేవాలి కానీ మన చేతులతో ఖర్చు పెట్టడం వాక్యమునకు వ్యతిరేకమైనది.

క్రైస్తవులు తమ జీవితములలో ధనం విషయములో బహు జాగ్రత్త కలిగి ఉండాలి. మనం పుడుతూ ఈ లోకములోనికి ధనం తేలేదని, కలిగినదేదైనా ఉంటే దేవుని వలననే మనకి కలిగినదని గ్రహించి దేవునివి దేవునికి ఇచ్చే విషయములో ఎంతో జ్ఞానముతో వ్యవహరించాలి.



# నదులు

## యూఫ్రటీసు

ఏదేను తోటలోని నాలుగు నదులలో ఒకటి యూఫ్రటీసు నది. బైబిలు గ్రంథములో ఈ నది పేరు అనేకసార్లు కనబడును. లోకములోని పెద్ద నదులలో ఒకటి ఆసియా ఖండములో పశ్చిమమందున్నది. ఆర్మీనియా పర్వతములలో నుండి జన్మించిన రెండు పాయలు దీనిలోనికి కలియుచున్నవి. ఆ రెండు పాయలలో ఉత్తరపు పాయకు ఫ్రాతు అను పేరు కలదు. ఇది చిన్న పాయయైననూ దాని వలననే ఆ నది అంతటికి ఫరాతు అను పేరు కూడా కలిగెను. ఆ రెండు పాయలు ఒకచోట కలిసిన తరువాత అది మొదట నైరుతి దిక్కు నుండి మధ్య సముద్రము దాపునకు ప్రవహించును. ఈ నది 1800 మైళ్ళ పొడవు గలదై యున్నది. ఈ నదికి దక్షిణముగా బాబెలు పట్టణము ఉన్నది. పురాతన కాలములో ఉత్తర మెసపొతేమియా యందు మిక్కిలి ప్రసిద్ధమైన కర్కెమిషు పట్టణము ఈ నదికి సమీపముగా ఉన్నది.

పూర్వకాలములో ఐరోపా, ఆసియా నుండి పారసీదేశమునకును భారత ఖండమునకును మార్గముండెను. ఇశ్రాయేలీయులకు దేవుడు వాగ్దానము చేసిన దేశమునకు ఇది ఉత్తరముగా ఉన్నది. దావీదు సొలోమోను అను రాజుల కాలములో వారి దేశము ఈ నది వరకు వ్యాపించెను. ఈ నది మొదట అష్షూరుకును తరువాత బబులోనుకును ఆ తరువాత పారసీ రాజ్యమునకును సహజమైన పశ్చిమ హద్దుగా ఎంచబడెను. తరువాత కాలములో రోమీయులు దీనిని తమ రాజ్యమనకు తూర్పు హద్దుగా ఎంచిరి. ఇది ఒక హద్దుగా ఉండుట వలన దీని సమీపమున యుద్ధములు జరుగుట సహజము.

ఐగుప్తీయులు ఫరోనెకో అను చక్రవర్తి క్రింద ఈ నదికి సమీపమున నుండు కర్కెమిషు పట్టణము నొద్ద బాబెలు వారితో యుద్ధము చేసిరి. ఇశ్రాయేలీయులను బాధపరిచి చెరబట్టిన అష్షూరీయులు బబులోనీయులను వారు ఈ నదీ ప్రాంతముల నుండి వచ్చుటచే ప్రకటన గ్రంథములో ఇది అంత్య కాలమున దేవుని రాజ్యమును వ్యతిరేకించు వారి ఉత్పత్తి స్థానముగా ఎంచబడెను. దానికి సంబంధముగా ఒక ఉగ్రత పాత్రను ఆ నది మీద పోసినట్లున్నది.

# ప్రార్థన - ఊపిరిపీల్చుట వంటిదే

తరచుగా మనం ఏదైనా ప్రార్థనా అవసరతని, పరిస్థితిని గురించి విన్నప్పుడు, దీని గురించి తర్వాత నేను ప్రార్థించే సమయంలో ప్రార్థించాలి  అని అనుకుంటాము. ఆ ఆలోచన సాతాను యొక్క ఎత్తుగడై యున్నది. ఆ నిమిషమే ఎందుకు ప్రార్థించకూడదు? ప్రార్థన పట్ల మనకి ఉన్న తప్పుడు మనఃస్వభావమును బట్టి మనం వెంటనే ప్రార్థించము. మనం కేవలం మన మనస్సులను అనుసరించినట్లయితే సులువుగానే ఉంటుంది. అయితే సాతాను ప్రార్థనను కష్టమైనదిగా చేయాలని అనుకుంటున్నాడు. మనం ఆ విషయమును పూర్తిగా మార్చిపోతామనే ఆశతో ఆలస్యము చేయాలని చూస్తున్నాడు. మనకు ప్రార్థించాలన్న ఆశ లేక అవసరత వచ్చిన వెంటనే ప్రార్థించుట సులువైనది, మరియు దినమంతా ప్రతి సందర్భంలో దేవునితో నిరంతరంగా సంధింపబడి ఉండుటకు ఇది ఒక మార్గమైయున్నది.

పాస్టర్ టామీబార్నెట్ మాట్లాడిన "అర్థగంట" అనే ఒక టేప్ నేను విన్నాను. ఆ ప్రసంగంలో సమయమును జ్ఞానంగా వాడమని మనలను ప్రోత్సాహపరుస్తున్నాడు. సమయం సరిపోవటం లేదని గొణుగుటకు బదులుగా ఉన్న సమయమును తెలివిగా ఉపయోగించమని చెప్తున్నాడు. విమానం ఎక్కుట కోసం విమానాశ్రయంలో వేచియున్న సమయంలో అన్నీ పుస్తకాలు వ్రాశానని చెప్పాడు. ప్రార్థించుటకు సమయం లేనంతగా పనులలో మునిగి యున్నాము అనుకునే వారికి ఇది నిజంగా గొప్ప ప్రోత్సాహకరం. "నాకు ప్రార్థించడానికి నిజంగా అర్థగంట సమయం కూడా లేదు" అని కొన్నిసార్లు కొంతమంది చెప్తుంటారు అది సరే, మనం విసుగక నిత్యము ప్రార్థిస్తున్నప్పుడు 30 సెకన్లలో చాలా ప్రార్థించగలము. మనకి ఉన్న కొద్ది సమయంతో దేవుని గౌరవించుట మొదలుపెట్టినపుడు దేవుడు దానిని అభివృద్ధి చేస్తాడు.

మనం నిజంగా సమయమును తినేసే లోకంలో జీవిస్తున్నాము. ఇందులో ప్రతీది ఆవశ్యముగానే అనిపిస్తుంది. మనలను తీరిక లేకుండా ఉంచి, వాక్యం చదువుటకు ప్రార్థించుటకు సమయం మిగలకుండా ఉంచుటలో సాతాను పూర్తిగా విజయవంతమైనాడు. మనం అసామాన్యమైన ఒత్తిడిలో ఒకదాని నుంచి మరియొక దానికి, దాని నుంచి ఇంకొక దానికి పరిగెడుతూ చివరకు జీవితములో నిజంగా ముఖ్యమైన వాటిని అనగా కుటుంబం, మన ఆరోగ్యం, దేవుడు, ఆత్మీయ జీవితములను పట్టించుకొనుట అను వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసే స్థితికి వస్తున్నాము.

తర్వాత మనం మరింత అలసిపోతాము. దానిని పరిష్కరించుటకు ఉన్న ఒకే ఒక మార్గం దేవుని వద్దకు వచ్చుట, ఇది నిజం ఆయనకు వేరుగా మనం జీవించలేము. మన వైవాహిక జీవితములు బాధింపబడతాయి. మన పిల్లలు బాధపడతారు మన ఆర్థిక స్థితి గందరగోళమవుతుంది, మన సంబంధాలు వృద్ధి చెందవు. ఇవన్నీ మనం ప్రార్థనలో, వాక్యములో సమయం గడపకపోవుట వలన సంభవిస్తాయి.

**(ఇంకా ఉంది)    - సేకరించబడినది (జాయిస్ మేయర్ గారు వ్రాసిన గ్రంథం)**




# బైబిల్ క్విజ్ -19

**1. మన స్వాస్థ్యమునకు సంచకరువు ఏమిట ?**
**2. సంఘమునకు పునాది ఎవరు?**
**3. తాను పరిశుద్ధులందరిలో అత్యల్పుడనని చెప్పిన అపోస్తలుడు ఎవరు?**
**4. దేవుని బిడ్డ తన నడుముకు ఏమి కట్టుకోవాలి?**
**5. విమోచన దినం వరకు మనం ఎవరియందు ముద్రించబడియున్నాము?**
**6. పౌలు మాటల ప్రకారం ఎవరికి చోటివ్వవద్దు?**
**7. సూర్యుడు అస్తమించే వరకు ఏమి నిలిచి యుండవద్దు?**
**8. ఆపద్దినమందు మనము ఏమి ధరించుకోవాలి?**
**9. పరిశుద్ధుల మధ్యలో వేటి పేరు ఎత్తడానికి కూడ అనుమతిలేదు?**
**10. దినములు చెడ్డవి గనుక మనం ఏమి చెయ్యాలి?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు డిశంబర్ 15 వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జనవరి 2012 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070

**బైబిల్ క్విజ్ – 18 జవాబులు :**

1. గలతీ సంఘమును గూర్చి 4:15
2. కేఫాను 2:11
3. విశ్వాస గృహమునకు చేరినవారియెడల 6:10
4. తాను పూర్వమందు పాడుచేయుచు వచ్చిన మతమును ప్రకటించుచున్నాడని 1:23,24
5. యాకోబు, కేఫా యోహాను 2:9
6. భిన్నమైన సువార్త తట్టుకు తిరిగిపోవుట చూచి 1:6
7. యేసుక్రీస్తు సిలువయందు 6:14
8. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించుము అనే మాటలో 5:14
9. సువార్త సత్యము చొప్పున క్రమముగా నడుచుకొనక పోవుటవలన 2:14
10. యేసుక్రీస్తు 3:14

**బైబిల్ క్విజ్ – 18 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

కృప, సత్యనారాయణ, మల్లిక, విజయ, నవ్యక, విజయకుమారి, జానకి, ఆశాకిరణ్, ఎస్తేరు, దుర్గ

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

**నవంబర్ - డిసెంబర్**

**భాగ్యలత** : సుధారాణి, హెప్సిబా, మణి, మేఘన, రాధిక, ప్రజ్ఞ, ప్రవీణ్, ప్రవల్లిక, అభిషేక్, కనికరమ్మ, రూప, థామస్, రమేష్, తర్షీనా, రాజ్‌కుమార్, సతీష్‌బాబు, అమూల్య, చంద్రకళ, పుష్పలత, రాధిక, లూధియ, సతీష్, నవీన్, కరుణ, కృష్ణవేణి, ప్రవీణ్, ఆశీర్వాదమ్మ, దివ్యజ్యోతి, అనిష్‌ప్రసాద్, ఫిన్నీనోయల్, భవ్యదీపిక

**చింతల్** : రాజ్‌కిరణ్, శశాంక్, మార్గరేట్, దానియేల్, వెంకటేశ్వర్రావు, నాగేశ్వర్రావు, సుహాసిని, కుమారి, పావని, దానియేలు, దివ్యజ్యోతి, సాల్మన్, ఎస్తేరురాణి, మంజుల, లక్ష్మారెడ్డి,

**అనాజ్‌పూర్** : థామస్‌పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్.

**ఇ.సి.ఐ.యల్** : ప్రేమ్‌కుమార్.



**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________

2. చిరునామా: ______________________

______________________

______________________

పిన్ కోడ్: ______________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________

______________________

______________________

______________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 9666666249, 040-2420 2227



ఎపఫ్రా
గాస్పెల్ చర్చ్
చింతల్ నందు
నూతన ఫ్లోర్
ప్రారంభం
అనంతరం
దేవునిని
ఆరాధించడం
జరిగినది.








అక్టోబర్ 16, 2011 ఆదివారం, HMT చింతల్ - హైదరాబాద్
ఎపఫ్రా గాస్పెల్ చర్చ్ నందు నూతన ఫ్లోర్‌ని ప్రారంభించడం జరిగినది.
ఈ కార్యక్రమాన్ని దేవుడు ఎంతో ఆశీర్వాదకరంగా జరిగించాడు.









# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org